సాక్షి నల్లగొండ

ఆదివారం । 29 । జనవరి । 2023



సైదన్నా.. మళ్లొస్తాం

జాన్‌పహాడ్ దర్గా ఉర్సు శనివారం దీపారాధనతో ముగిసింది. చివరి రోజు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. - 8లో



బీఆర్‌ఎస్‌ను బొందపెడతారు

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు బొందపెట్టడం ఖాయమని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
33°/18°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇద్దరు డీఎస్పీలు బదిలీ

నల్లగొండ, క్రైం: జిల్లాలో ఇద్దరు డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. మిర్యాలగూడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు ఖమ్మం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు. నల్లగొండలోని డీటీసీలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు.

పార్క్ పనులు త్వరగా పూర్తిచేయాలి



అధికారులకు సూచనలిస్తున్న ఎస్‌ఈ

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని ఖిలా ఆవరణలో రూ.5కోట్లతో చేపట్టిన పార్క్ పనులను అధికారులు త్వరగా పూర్తి చేయాలని ప్రజారోగ్య ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పార్క్ పనులతో పాటు ఎస్‌టీపీ (మురుగు నీటి శుద్ధి కేంద్రం) పనులను ఆయన సంబంధిత మున్సిపల్ అధికారుతో కలిసి పరిశీలించి మాట్లాడారు. పార్క్ ఆవరణలో చేపట్టిన కృత్రిమ జలపాతం, వాకింగ్ ట్రాక్స్ పనులను వేగవంతం చేయాలన్నారు. మురుగు నీటి శుద్ధి కేంద్రం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ ఈఈ మనోహర్, ఏఈ రాజు, కన్సల్టెంట్ అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతు బీమాను పకడ్బందీగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీడీఏ శైలజ

మిర్యాలగూడ: రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన రైతుబీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీఏ) శైలజ, సీ అండ్ డీఏ సచిన్‌దత్ అన్నారు. శనివారం మిర్యాలగూడ రైతువేదికలో ఏఈఓలకు రైతుబీమా కొత్త మోడల్ సిస్టం గురించి అవగాహన కల్పించి మాట్లాడారు. రైతుబీమా పథకం అమలులో ఎక్కడా జాప్యం జరగొద్దని, రైతు మరణించిన వెంటనే ఆ విషయాన్ని సంబంధిత వ్యవసాయాధికారికి తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పి.నాగమణి, ఏఓలు కల్యాణ్‌చక్రవర్తి, రుషేంద్రమణి, ఏఈఓలు సైదులు, రమేష్, షఫి, స్వప్న, సంతోష్ పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకటయ్య

పెద్దవూర: పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు జిల్లా సహాయ గిరిజన అభివృద్ధి అధికారి (ఏటీడీఓ) ఉడుతనూరి వెంకటయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్టీ రెగ్యులర్, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, సమీకృత బాలికల వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలు, రికార్డులతోపాటు వసతి గృహం, ఆశ్రమ పాఠశాలలో మౌలిక వసతులు పరిశీలించి మాట్లాడారు. ప్రత్యేక తరగతులను పకడ్బందీగా నిర్వహించాలని హెచ్‌ఎంలు, వార్డెన్లు, ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్యూటర్లచే విద్యా బోధన చేయించాలన్నారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం ధీరావత్ బాలోజీ, వసతిగృహ సంక్షేమ అధికారి కొల్లు బాలకృష్ణ, సంధ్యారాణి, ఉపాధ్యాయులు రాంరెడ్డి, షబ్బీర్, కృష్ణ, శ్రీను, రామయ్య తదితరులు ఉన్నారు.

ఎంజీయూలో జాతీయ స్థాయి సెమినార్

నల్లగొండ రూరల్: భారత గణిత శాస్త్ర మేధావి డాక్టర్ రామానుజన్ జయంతిని పురస్కరించుకొని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో గణిత విభాగం ఆధ్వర్యంలో శనివారం రీసెంట్ టెక్నిక్స్ ఇన్ మ్యాథమేటికల్ అప్లికేషన్స్ అనే అంశంపై ఒకరోజు జాతీయస్థాయి సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆచార్య అలువాల రవి, ఆచార్య సత్యనారాయణ, డాక్టర్ శ్రీనివాస్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్ఎస్ అన్నపూర్ణ బుట్టి, వివిధ విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఇక సెలవు

ఫ్లోరోసిస్ పోరాట యోధుడు అంశాల స్వామి అస్తమయం



అంశాల స్వామి (ఫైల్)

- ఫ్లోరైడ్ రక్కసిని ప్రపంచానికి తెలియజెప్పడంలో ప్రముఖ పాత్ర
- చిన్న వయస్సు నుంచే పోరాట బాట
- తన పరిస్థితి మరొకరికి రాకూడదని ఎన్నో ఆందోళనలు
- ప్రభుత్వాలలో కదలిక వచ్చేలా ఉద్యమాలు
- శివన్నగూడెం రిజర్వాయర్‌కు స్వామి పేరు పెట్టాలని స్థానికుల డిమాండ్

మర్రిగూడ : ఫ్లోరోసిస్ రక్కసితో జీవచ్ఛవంలా మారి ప్రపంచంలోనే అత్యధిక ఫ్లోరైడ్ కలిగిన మర్రిగూడ మండలాన్ని ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన శివన్నగూడెం గ్రామానికి చెందిన అంశాల స్వామి(37) శుక్రవారం కన్నుమూశారు. శుక్రవారం ఎలక్ట్రిక్ ట్రైసైకిల్‌పై ప్రయాణిస్తూ గ్రామంలో తన వ్యక్తిగత పనులను చూసుకుని తిరిగి ఇంటి వస్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురై శనివారం ఉదయం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్వామి ఐదేళ్ల వయస్సు నుంచే ఫ్లోరోసిస్ విముక్తి పోరాటంలో భాగస్వామి అయ్యాడు. ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ కంచుకట్ల సుభాష్, జలసాధన సమితి వ్యవస్థాపకుడు దుశ్చర్ల సత్యనారాయణతో కలిసి అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. వారి పోరాటాల ఫలితంగానే శివన్నగూడ రిజర్వాయర్ నిర్మాణం చేపడుతున్నట్లు ఈ ప్రాంత వాసులు పేర్కొంటున్నారు. స్వామి మృతి విషయం తెలుసుకున్న మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వామి కుటుంబ సభ్యులకు రూ.50 వేల ఆర్థిక సాయం అందజేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కర్నాటి విద్యాసాగర్, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బీజేపీ నాయకులు బూర నర్సయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు చల్లమల్ల కృష్ణారెడ్డి, వికలాంగుల చైర్మన్ వాసుదేవరెడ్డి, సమాచార హక్కు సాధన సమితి జాతీయ అధ్యక్షుడు బొమ్మరబోయిన కేశవులు, పల్లె రవికుమార్, పల్లె వినయ్‌కుమార్, కర్నాటి శ్రీనివాసులు, ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్ రెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్ తదితరులు ఉన్నారు.



అంశాల స్వామి అంతిమయాత్రలో పాడె మోస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, జల సాధన సమితి నాయకుడు దుశ్చర్ల సత్యనారాయణ

32 ఏళ్లుగా పోరాటం

మర్రిగూడ మండలం శివన్నగూడ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన అంశల స్వామి పుట్టుకతోనే ఫ్లోరైడ్ బాధితుడు. అంశాల సత్యనారాయణ, వెంకటమ్మ దంపతులకు నలుగురు సంతానం కాగా స్వామి పెద్ద కుమారుడు. స్వామితోపాటు చెల్లె కూడా పుట్టుకతోనే ఫ్లోరైడ్ బాధితురాలు. ఆమెతోపాటు మరో చెల్లి అనారోగ్యంతో మృతిచెందారు. ఉన్న మరో చెల్లి, వృద్ధాప్య తల్లిదండ్రులతో కలిసి స్వామి జీవిస్తున్నాడు. తన ఐదేళ్ల వయస్సు నుంచే 32 సంవత్సరాలుగా అనేక ఫ్లోరైడ్ ఉద్యమాల్లో పాల్గొన్నాడు. ఫ్లోరైడ్ విముక్తి కోసం దేశ ప్రధాని, రాష్ట్రపతి, ముఖ్యమంత్రులు, మంత్రులు, కలెక్టర్, సినీ తారలను కలిశారు. ఫ్లోరైడ్ పెనుభూతం ఏ విధంగా ఉందో ప్రపంచ దేశాలకు తెలిసేలా చేసిన పోరాటాల్లో స్వామి పాత్ర కీలకం. స్వామి కుటుంబ జీవనోపాధికి గత ప్రభుత్వాలు హెయిర్ సెలూన్ షాపును ఏర్పాటు చేయించాయి. ప్రయాణించేందుకు ట్రైసైకిల్‌ను అందించాయి. ఫ్లోరైడ్ బాధితుడు అయినప్పటికీ కుటుంబ పోషణలో ముఖ్య భూమిక పోషించేవాడు. ఇప్పుడు స్వామి మరణంతో వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు, ఫ్లోరైడ్ బాధితురాలైన చెల్లెలిని ప్రభుత్వమే ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



నాటి ప్రధాని వాజ్‌పేయికి అంశాల స్వామి సమస్యను వివరిస్తున్న దుశ్చర్ల (ఫైల్)



2005లో హైదరాబాద్‌లో తనను కలిసిన స్వామిని పలకరిస్తున్న అప్పటి సీఎం వైఎస్సార్

ఇల్లు కట్టించిన మంత్రి కేటీఆర్..

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కర్నాటి విద్యాసాగర్ చొరవతో గతంలో మంత్రి కేటీఆర్ అంశాల స్వామి గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు అందించగా.. ఇంటి నిర్మాణం పూర్తయింది. ప్రహరీ నిర్మాణం, నీటి ట్యాంక్ ఏర్పాటుకు సహకరించాలని ఇటీవల కోరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో మంత్రి కేటీఆర్ స్వయంగా స్వామి ఇంటికి వచ్చి ఆయనతో కలిసి భోజనం చేశారు. స్వామి మృతికి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో తమ సంతాపాన్ని తెలిపారు.

శివన్నగూడెం రిజర్వాయర్ సాధన

ఫ్లోరోసిస్ శాశ్వత నిర్మూలనకు తన జీవితమంతా పోరాడిన యోధుడు అంశాల స్వామి. పుట్టుకతోనే ఫ్లోరైడ్ బాధితుడైన స్వామి తనలాగా మరొకరు ఆ ఫ్లోరైడ్ బారిన పడకుండా ఉండాలని 1992 నుంచి ఉద్యమబాట పట్టాడు. తనకు ఐదేళ్ల వయస్సు నుంచే తండ్రి సత్యనారాయణ సహాయంతో ఎక్కడికైనా వెళ్లేవాడు. ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్‌ను శాశ్వతంగా నిర్మూలించాలని, రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని చేపట్టిన ర్యాలీలు, ధర్నాల్లో స్వామి భాగస్వామి అయ్యాడు. శివన్నగూడ రిజర్వాయర్‌ను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ ఉండదని, రాబోయే తరాలకు ఆ సమస్య తలెత్తదని భావించి అనేక పోరాటాల్లో స్వామి పాల్గొన్నాడు. సీఎం కేసీఆర్ ఉద్యమాలు చేస్తున్న సమయంలో ఈ ప్రాంతంలో పర్యటించారు. ఫ్లోరైడ్ సమస్యపై కేసీఆర్‌కు సమగ్ర సమాచారం ఉండడంతో జూన్ 12, 2015లో శివన్నగూడ రిజర్వాయర్ పైలాన్ పనులకు శంకుస్థాపన చేశారు. శివన్నగూడ రిజర్వాయర్‌ను మొదటగా 14 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలని అనుకున్నారు. కానీ, 11.5టీఎంసీలకు తగ్గించారు. ఈ రిజర్వాయర్ ద్వారా దేవరకొండ, మునుగోడు, నల్లగొండ నియోజకవర్గాల్లోని 3.50 లక్షల ఎకరాలకు సాగు నీరు అందనుంది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధిచేసిన కృష్ణా జలాలు అందుతున్నాయి. నాటి పోరాటాల ఫలితమే నేడు తాగు, సాగు నీరు అందుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పోరాట ఫలితంగా వచ్చిన శివన్నగూడెం ప్రాజెక్టుకు అంశాల స్వామి పేరు పెట్టాలని పలు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



అంశాల స్వామితో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ (ఫైల్)

అక్రమ బదిలీలను నిలిపివేయాలి



డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నల్లగొండ: సెక్రటేరియట్ నుంచి దొడ్డి దారిన చేపడుతున్న అక్రమ బదిలీలను ఆపాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జీరో సర్వీస్‌తో బదిలీలకు అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్, టీఎస్‌యూటీఎఫ్, యూఎస్‌పీసీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల ప్రారంభ పూజల్లో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ తదితరులు

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- మహా మండపంలో కొనసాగిన ప్రత్యేక పూజలు
- హాజరైన మంత్రి, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ తదితరులు

నార్కట్‌పల్లి: తెలంగాణలోనే ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎస్పీ అపూర్వరావు, సినీ నిర్మాత శంకర్‌లకు దేవాదాయ శాఖ ఏసీ మహేంద్రకుమార్, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ప్రధాన అర్చకుడు రామలింగేశ్వరశర్మ, అర్చక బృందం ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. రథసప్తమి కావడంతో వేద పండితుడు అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని శాస్త్రి, నీలకంఠశివాచార్య, ఆలయ ప్రధాన అర్చకులు రామలింగేశ్వరశర్మ, సురేష్‌శర్మ, శ్రీకాంత్ శర్మ, సతీష్‌శర్మ, నాగయ్యశర్మలు వేద మంత్రాలతో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచం, దీక్షాదహణ, ఏకాదశ రుద్రాభిషేకం, నిరాజన మంత్ర పుష్పాలతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఆ తర్వాత ప్రధానాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. చివరగా అతిథులకు ఆశీర్వచనం అందించి సన్మానించారు.



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

ఆలయ అభివృద్ధికి కృషి : మంత్రి జగదీశ్‌రెడ్డి

ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగి ఎంతో ప్రాశస్త్యాన్ని చాటుకుంటున్న చెర్వుగట్టు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో పూజల అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. చెర్వుగట్టు అభివృద్ధి గురించి సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. దేవాలయానికి వెళ్లేందుకు రెండో ఘాట్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులుకు ఇబ్బందులు కలగకుండా దేవాదాయ శాఖ అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి, సర్పంచ్ భాలకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరు శంకర్, కార్యనిర్వాహణ అధికారి నవీన్‌కుమార్, ఎంపీడీఓ సాంబశివరావు, తహసీల్దార్ మురళీమోహన్, ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్య, మేడి శంకర్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

మొదలైన ఆన్‌లైన్ దరఖాస్తులు

- ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ షురూ..
- మెడికల్ బోర్డులో 35 మంది సర్టిఫికెట్ల పరిశీలన
- న్యూరో సమస్యల వారిని తిరస్కరించిన బోర్డు
- తమకూ అవకాశమివ్వాలని డీఈఓకు విన్నపం



యూటీఎఫ్ కార్యాలయంలో ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

నల్లగొండ: ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి శనివారం ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. బదిలీల కోసం ఈనెల 30వ తేదీ వరకు ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ సూచించింది. దీంతో మొదటి రోజు పెద్ద ఎత్తున మీసేవ కేంద్రాలతోపాటు ఉపాధ్యాయ సంఘాల పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని పీఆర్‌టీయూ, టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. దీంతో ఉపాధ్యాయులు అక్కడికి వెళ్లి దరఖాస్తులు చేసుకుంటున్నారు.

తొలి రోజు 35 మంది సర్టిఫికెట్ల పరిశీలన..

ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో భాగంగా జారీ చేసిన జీఓ నంబర్ 5లో పేర్కొన్నట్టుగా కొన్ని వ్యాధులకు సంబంధించి వాటిబారిన పడిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం సడలింపు ఇచ్చింది. దీంతో తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డు వద్ద సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాలని డీఈఓ ఆదేశించారు. ఈ మేరకు శనివారం మొదట రోజు 35 మంది ఉపాధ్యాయులు వివిధ వ్యాధుల బారిన పడి చికిత్స పొందుతున్నవారు మెడికల్ బోర్డు వద్ద సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. వీరిలో క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, బోన్ టీబీ, కిడ్నీ, లివర్, హార్ట్ ట్రాన్స్‌పాంటేషన్‌తోపాటు కిడ్నీ డయాలసిస్‌తో బాధపడే వారికి గత సంవత్సరం బదిలీల్లో అవకాశం కల్పించారు.

మాకూ అవకాశం ఇవ్వాలి



న్యూరో సర్జరీ అయి నేను ఇబ్బంది పడుతున్నాను. శనివారం సర్టిఫికెట్లతో వెళ్లగా న్యూరో బాధితులకు లేదని మెడికల్ బోర్డు పరిశీలించలేదు. గతంలో మాదిరిగా మాకూ అవకాశం ఇవ్వాలి.

– శ్రీనివాస్, స్కూల్ అసిస్టెంట్, కురుమర్తి

న్యూరో బాధితులవి నిరాకరణ..

న్యూరో వ్యాధితో బాధపడుతూ సర్జరీలు అయిన ఉపాధ్యాయులు మెడికల్ బోర్డులో సర్టిఫికెట్ల పరిశీలన కోసం శనివారం డీఈఓ కార్యాలయానికి రాగా బోర్డు సభ్యులైన డాక్టర్లు అవకాశం లేదంటూ వారిని వెనక్కు పంపారు. దీంతో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం ఆధ్వర్యంలో సదరు ఉపాధ్యాయ బాధితులు డీఈఓ భిక్షపతి దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు. గతేడాది మాదిరిగా ఈ సారి కూడా తమకూ అవకాశం ఇవ్వాలని విన్నవించగా పరిశీలిస్తామని డీఈఓ హామీ ఇచ్చారు.

గొర్రెల యూనిట్లు ఏమాయే!

- రెండో విడత నిధులు మంజూరై నాలుగు నెలలు
- నేటికీ మొదలుకాని యూనిట్ల గ్రౌండింగ్
- ఖాతాల ఫ్రీజింగ్ ఎత్తివేసి నెల రోజులు
- ఎదురుచూపుల్లో డీడీలు చెల్లించిన లబ్ధిదారులు



నల్లగొండ అగ్రికల్చర్: గొర్రెల యూనిట్ల కోసం గొల్లకురుమలకు ఎదురు చూపులు తప్పడం లేదు. అప్పులు చేసి మరీ తమ వాటాధనం కింద రూ.43,750లను డీడీల రూపంలో పశుసంవర్ధక శాఖకు అందజేసి నాలుగు నెలలు గడుస్తోంది. మునుగోడు ఉప ఎన్నిక ముందు రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. దీంతో నల్లగొండ, భువనగిరి యాదాద్రి జిల్లాల పరిధిలోని మునుగోడు నియోజకవర్గంలో గల మండలాల్లో సుమారు 7,569 మంది గొల్లకురుమలను లబ్ధిదారులుగా ఆయా జిల్లాల యంత్రాంగం ఎంపిక చేసింది. నల్లగొండ జిల్లాలో సుమారు 3,753 మంది, మిగతావారు యాదాద్రి జిల్లా పరిధిలో లబ్ధిదారులుగా ఎంపికయ్యారు. ఒక్కో యూనిట్ కింద 20 గొర్రెలతో పాటు ఒక పొట్టేలు విలువ రూ.1,75,750లుగా నిర్ణయించి లబ్ధిదారుల వాటా కింద రూ.43,750లను డీడీల రూపంలో జిల్లా పశుసంవర్ధక శాఖ తీసుకుంది.

గతేడాది అక్టోబర్‌లోనే ఖాతాలో డబ్బులు జమ..

మునుగోడు ఉప ఎన్నిక నోటిఫికేషన్‌కు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో గతేడాది అక్టోబర్ మొదటి వారంలో డబ్బులను నేరుగా జమచేసింది. మొదటి విడతలో లబ్ధిదారుల ఖాతాల్లో కాకుండా జిల్లా యంత్రాంగం ఖాతాలో డబ్బులను జమచేసి వారి ద్వారా గొర్రెలను కొనుగోలు చేయించింది. అయితే ఉప ఎన్నిక నేపథ్యంలో రెండో విడత నేరుగా రైతు ఖాతాల్లో జమచేసింది. లబ్ధిదారుడు ఇష్టం వచ్చిన చోట మండల కమిటీల పర్యవేక్షణలో గొర్రెలను కొనుగోలు చేసుకునే విధంగా వేసులుబాటు కల్పించారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమచేయడంతో సుమారు 400 మంది లబ్ధిదారులు యూనిట్లు కొనకుండానే డబ్బులను డ్రా చేసుకున్నారు. అయితే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జయచేయడం వల్ల నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, వారి ఖాతాలను ఫ్రీజింగ్ చేసి నేరుగా అధికారులే యూనిట్లను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఒక స్వచ్ఛంద సంస్థ ఫిర్యాదు చేసింది. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాలతో అక్టోబర్ 31న లబ్ధిదారుల ఖాతాలను రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీజింగ్‌లో పెట్టింది.

వడ్డీలు పెరుగుతున్నాయి



డీడీలు చెల్లించడానికి అప్పులు చేయాల్సి వచ్చింది. ఇప్పటి వరకు గొర్రెలను ఇవ్వకపోవడంతో తెచ్చిన అప్పులపై వడ్డీలు పెరిగిపోతున్నాయి. ఎప్పుడు ఇస్తారో కూడా అధికారులు చెప్పడం లేదు. వెంటనే గొర్రెలను ఇప్పించాలి.

– నేతల వెంకటయ్య, తుంగపాడు, నాంపల్లి మండలం

ప్రక్రియ ప్రారంభమైంది



జిల్లాకు మంజూరైన గొర్రెల యూనిట్ల గ్రౌండింగ్‌కు ప్రక్రియ ప్రారంభమైంది. కలెక్టర్ అనుమతితో లబ్ధిదారులు కోరుకున్న చోట మండల అధికారుల బృందం సమక్షంలో గ్రౌండింగ్ చేయనున్నాం. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందొద్దు.

– డాక్టర్ అంజటి యాదగిరి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

ఫ్రీజింగ్ ఎత్తివేసినా..

నవంబర్ 3న మునుగోడు ఉప ఎన్నిక పోలింగ్ ముగిసి.. 6న కౌంటింగ్ జరిగింది. అనంతరం వివిధ సంఘాల ఆందోళనలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల క్రితం లబ్ధిదారుల ఖాతాలపై విధించిన ఫ్రీజింగ్‌ను ఎత్తివేసింది. అయినా నేటికీ గొర్రెల యూనిట్లు గ్రౌండింగ్ కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా జనవరి నెలాఖరుకు వరకు యూనిట్లు కొనుగోలు చేయిస్తామని ప్రకటించినా నేటికీ అతీగతిలేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియ మొదలు పెట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ప్రచార శాఖ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఈఓ గీతారెడ్డి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ పడమటి అష్టభుజి ప్రాకార మండపంలో ఏర్పాటు చేసిన ప్రచార శాఖ, శాశ్వత పూజల విరాళాల సేకరణ కార్యాలయాన్ని శనివారం ఈఓ గీతారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాదాద్రి కొండపైకి వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని, వారి సౌకర్యార్థం ప్రచార శాఖ, శాశ్వత పూజల విరాళాల కార్యాలయాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ కార్యాలయ కౌంటర్లను ఏర్పాటు చేసేందుకు కరూర్ వైశ్య బ్యాంక్ సహకరించిందని, ఇందుకు వారి కి కృతజ్ఞతలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు దోర్బల భాస్కర్ శర్మ, గజివెల్లి రఘు, ఆచార్యులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని యల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే జాజాల సురేందర్, కుటుంబ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. రథ సప్తమి సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన ఎమ్మెల్యే సురేందర్, కుటుంబ సభ్యులకు ఆచార్యులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారి ఊడేపు వెంకటప్రసాద్ రాజు ప్రసాదం అందజేశారు.

రీజినల్ రింగ్ రోడ్డు బాధితుడికి గుండెపోటు

భువనగిరి : మండలంలోని రాయగిరి గ్రామానికి చెందిన రీజినల్ రింగ్‌రోడ్డు బాధితుడు, రైతు మద్దూరి రఘునందన్‌రెడ్డికి శనివారం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. గ్రామానికి చెందిన రైతుకు చెందిన భూమిని ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టు, హైటెన్షన్ వైర్ల ఏర్పాటుకు కోల్పోయాడు. ప్రస్తుతం రీజినల్ రింగ్ రోడ్డు కోసం ఉన్న కాస్త భూమి పోతుండడంతో గ్రామస్తులు చేస్తున్న ఉద్యమంలో పాల్గొంటున్నాడు.

పోరు బిడ్డకు కన్నీటి వీడ్కోలు



అంతిమయాత్రకు హాజరైన బంధువులు, స్నేహితులు, నాయకులు



స్వామికి దుస్తులు బహూకరిస్తున్న కేటీఆర్ (ఫైల్)



స్వామి మృతదేహంపై పడి రోదిస్తున్న జలసాధన సమితి నేత దుశ్చర్ల సత్యనారాయణ

- అంశాల స్వామి అంతిమయాత్రలో పాల్గొన్న ప్రముఖులు, గ్రామస్తులు
- పాడె మోసిన ఎమ్మెల్యే కూసుకుంట్ల
- జ్ఞాపకాలు గుర్తు చేసుకున్న వివిధ సంఘాల నాయకులు

చండూరు, చౌటుప్పల్ : ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితిలో నేను సైతం అంటూ 37ఏళ్లు చురుకైన పాత్ర పోషించిన స్వామి అంతిమ యాత్రకు శనివారం ఊరూవాడ కదిలొచ్చింది. వివిధ పార్టీల నాయకులు, ఆయా సంఘాల నేతలు అంతిమయాత్రలో పాల్గొన్నారు. స్వామి పాడెను మునుగోడు



స్వామి ట్రై సైకిల్

ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కంచుకుంట్ల సుభాష్, జలసాధన సమితి నేతల దుశ్చర్ల సత్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కర్నాటి విద్యాసాగర్, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, ఎంపీపీ మెండు మొహన్‌రెడ్డి, పల్లె రవి, వినయ్, తదితరులు పట్టుకొని అంతిమయాత్రలో ముందుకు సాగారు. అంతిమయాత్రలో పాల్గొన్న వారంతా కన్నీటి పర్యంతమయ్యారు. స్వామి ఎవ్వరినైనా.. బాగున్నావా అంటూ పలకరించే వాడని ఆ గ్రామ మహిళలు బోరున విలపించారు. దారి పొడవునా స్వామికి జోహార్లు.. జోహార్లు అంటూ యాత్ర కొనసాగింది. స్వామికి వివాహం కాకపోవడంతో కుటుంబ సాంప్రదాయం ప్రకారం జిల్లేడు చెట్టుతో పెళ్లి చేసి మృతదేహాన్ని పాడెలో పెట్టారు.



ఎస్టీడీ బూత్ నడిపిస్తున్న స్వామి (ఫైల్)

తల్లడిల్లిన సహచర ఉద్యమకారులు..

అంశల స్వామి.. ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కంచుకంట్ల సుభాష్‌కు సహచరుడిగా 32ఏళ్లుగా ఉద్యమంలో పనిచేశారు. ప్రతి చోటా స్వామిని చూపిస్తూ తాగునీటి కోసం ఆనాడు వారు ఉద్యమించారు. స్వామి ఇక లేరని తెలియగానే సుభాస్ తల్లడిల్లి పోయారు. తమ ఉద్యమ జ్ఞాపకాలను తలుచుకుని బోరున విలపించారు. స్వామి పేరును శివన్నగూడెం రిజర్వాయర్ కు పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



అప్పటి కలెక్టర్ ముక్తేశ్వరరావుతో..

శివన్నగూడెం ప్రాజెక్టు సాధనలో కీలకపాత్ర



ఫ్లోరైడ్ వ్యాధితో అంశల స్వామి అతిచిన్న వయసులో మృతిచెందడం బాధాకరం. చిన్నతనం నుంచే అనేక రకాల ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించడం గొప్ప విషయం. తెలంగాణ వ్యాప్తంగా మిషన్ భగీరథ నీళ్ల, శివన్నగూడెం రిజర్వాయర్ సాధనలో అంశల స్వామి కీలక భూమిక పోషించాడు. ఆయన మరణం బాధాకరం. ఫ్లోరైడ్ బాధితుడు అయినప్పటికీ ఆయన పోరాట పటిమ స్ఫూర్తిదాయకం

– చలమల్ల కృష్ణారెడ్డి, టీపీసీసీ ప్రధానకార్యదర్శి

స్వామి మరణం కలచివేసింది



నల్లగొండ జిల్లా బిడ్డగా ఫ్లోరోసిస్ సమస్య తెలుసుకుని ఏదైనా పరిష్కారం కోసం ఎదురుచూశాం. 2016లో ఇండియా వచ్చాక కంచుకుంట్ల సుభాష్ సహాయంతో ఫ్లోరోసిస్ బాధితుడు అంశాల స్వామిని కలిసి అనేక విషయాలు తెలుసుకొని పోరాడాం. 2019 ఎన్నికల్లో వారణాసిలో ప్రధాని మోదీ మీద పోటీకి స్వామి నామినేషన్ పత్రాలు తీసుకెళ్లి ఫ్లోరోసిస్ సమస్యను దేశం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశాం. ఇటీవల మునుగోడు ఎన్నికల్లో ప్రచారం కోసం వెళ్తే 'అమ్మ చేతి చాయ్ తాగి వెళ్ల సర్' అన్నాడు. ఇటీవల మిత్రులం (మిలాప్ ద్వారా) కలిసి సుమారు 85,000/– స్వామి తల్లితండ్రుల వైద్య ఖర్చుల కోసం పంపితే ఎంతో ఆనంద పడ్డాడు. ఈ రోజు స్వామి మరణించడం అతని కుటుంబ సభ్యులకు తీరని లోటు. ఈ సమాజం ఒక పోరాట యోధుడిని కోల్పోయింది.

– జలగం సుధీర్, కోదాడ

ఫ్లోరోసిస్ అనగానే స్వామి పేరే గుర్తుకు వచ్చేది



ఫ్లోరోసిస్ అనగానే గుర్తుకు వచ్చే పేర్లు రెండే. అందులో మునుగోడు ఒకటి అయితే మరొకటి శివన్నగూడేనికి చెందిన అంశల స్వామి. ఫ్లోరోసిస్ విముక్తి కోసం స్వామి నిర్వహించిన పోరాటాలు ఎంతో స్ఫూర్తిదాయకం. ఆనాటి పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మిషన్ భగీరథ పథకానికి నాంది పలికింది. రాష్ట్రంలో ఒక్కరు కూడా ఫ్లోరైడ్ వ్యాధిగ్రస్తులు ఉండొద్దన్న లక్ష్యంతో భగీరథతో ఇంటింటికీ కృష్ణా జలాలు సరఫరా చేస్తుంది. ఫ్లోరైడ్ శాశ్వత విముక్తి కోసం తాగు, సాగు కోసం స్వచ్ఛమైన కృష్ణాజలాలు అందించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ శివన్నగూడెం, చర్లగూడెం ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు.

– కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే

స్వామితో పోరాటాల్లో పాల్గొన్నా..



పుట్టుకతోనే నేను కూడా ఫ్లోరోసిస్ బాధితుడినే. ఫ్లోరైడ్ విముక్తి కోసం జరిగిన పోరాటాల్లో చిన్నతనం నుంచే పాల్గొన్నాను. అప్పటి ప్రధానమంత్రి వాజ్‌పేయిని కలిసిన సమయంలో అంశల స్వామితో నేను కూడా ఢిల్లీ వెళ్లాను. దుశ్చర్ల సత్యనారాయణ, కంచుకంట్ల సుభాష్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేశాం. అంశం స్వామి మంచి మనసున్న వ్యక్తి. అకాల మరణం బాధాకరం. ఫ్లోరైడ్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అండగా నిలవాలి.

– కొత్తపల్లి నర్సింహ, కోదండాపురం

జనం గుండెల్లో సజీవంగా ఉంటాడు



స్వామి తండ్రిని పట్టుకుని రోదిస్తున్న దుశ్చర్ల సత్యనారాయణ

అంశాల స్వామి భౌతికంగా మన మధ్యన లేకపోయినా ఈ ప్రాంతంలోని జనం గుండెల్లో సజీవంగా ఉంటాడు. ఫ్లోరైడ్ మహమ్మారి నిర్మూలనకు స్వచ్ఛమైన కృష్ణ జలాలే పరిష్కారమని భావించి అందుకోసం ముందుండి పోరాడాడు. ఆ సమయంలో తన తండ్రితో కలిసి తాము తిరుపతి, శ్రీశైలం వంటి అనే దేవస్థానాలకు వెళ్లాం. ఎందుకు ఇతన్ని ఫ్లోరైడ్ శాపగ్రస్తుడిగా పుట్టించారని ప్రశ్నించాం. స్వామితో కలిసి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా అనేక పోరాటాలు చేపట్టాం. అప్పట్లో రైళ్లలో ఉచితంగా ప్రయాణం చేసేవాళ్లం. అందుకు రైల్వే అధికారులు సహకరించేవారు. కొత్తగా ఇచ్చిన ట్రైసైకిల్ వల్లే స్వామి మృతిచెందాడు. దీనికిట్రైసైకిల్ అందించిన సంస్థ బాధ్యత వహించి రూ.కోటి పరహారం అందించాలి. స్వామి తల్లిదండ్రులకు కూడా ప్రత్యేక పింఛన్ అందించి ఆదుకోవాలి.

– దుశ్చర్ల సత్యనారాయణ, జలసాధన సమితి ఉద్యమ నాయకుడు

శివన్నగూడేనికి స్వామి పేరు పెట్టాలి



అంశాల స్వామి అకాల మరణం బాధాకరం. స్వామి వయసు చిన్నదే అయినా ఆయన ఆలోచన మాత్రం చాలా పెద్దది. తనలాంటి జీవనం మరెవరికీ రావొద్దన్న సంకల్పంతో ఫ్లోరోసిస్ విముక్తి పోరాటంలో చురుకైన పాత్ర పోషించాడు. అకాల మరణం పొందిన అంశాల స్వామి ఆత్మకు శాంతి చేకూరాలంటే శివన్నగూడెం ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టాలి. ఈ మేరకు ప్రభుత్వం ముందుకు రావాలి.

– కంచుకట్ల సుభాష్, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్

స్వామిని ప్రభుత్వం అవమానించింది



స్వామి తన జీవితాంతం ఫ్లోరైడ్ విముక్తి కోసం పోరాడాడు. పోరాటాలు, ఉద్యమాలతోనే నాటి ఉద్యమ పార్టీ, నేడు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఫ్లోరోసిస్‌పై స్పందించింది. భగీరథ పథకం తెచ్చింది. అలాంటి పోరాటాలకు ఆద్యుడైన అంశల స్వామి అంత్యక్రియలు ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాల్సి ఉండే. అలా చేయకుండా ప్రభుత్వం అతన్ని అవమానించింది. ఫ్లోరైడ్ బాధితుల బాగు కోసం హాస్టళ్ల ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలి. స్వామి చనిపోయిన విషయాన్ని ఫేస్‌బుక్‌లో చూసి అంత్యక్రియలకు వచ్చాను.

– వేనేపల్లి పాండురంగారావు, మట్టి మనుషుల వేదిక, మిర్యాలగూడ

ఉద్యమ నాయకుడి మరణం బాధాకరం



అంశల స్వామి గొప్ప ఉద్యమకారుడు. ఫ్లోరోసిస్ మహమ్మారి విముక్తే లక్ష్యంగా పోరాడాడు. 1996లో అప్పటి ప్రధానమంత్రి వాజ్‌పేయిని ఫ్లోరైడ్ వ్యాధిగ్రస్థులు స్వయంగా ఢిల్లీలో కలిశారు. ఇన్నేళ్లవుతున్నా సమస్య పూర్తిగా పరిష్కారమవ్వలేదు. ఇప్పటికీ వేలాది మంది బాధితులు ఉన్నారు. ఫ్లోరైడ్ వ్యాధిగ్రస్థులపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిసారించాలి. వారి బాగోగులు చూసుకోవాలి. ఆత్మీయ ఉద్యమ నాయకుడి మరణం బాధాకరం. చాలా దురదృష్టకరం.

– డాక్టర్ చెరుకు సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు

అంశాల స్వామి పోరాటం మరువలేనిది

- గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: పుట్టుకతోనే వైకల్యం బారినపడినా మనోధైర్యంతో ఫ్లోరోసిస్ బాధితుల పక్షాన అంశాల స్వామి చేసిన పోరాటం మరువలేనిదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి నాయకుడు అంశాల స్వామి మృతికి గుత్తా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎవరు కూడా తన లాగా ఫ్లోరోసిస్ బారిన పడకుండా ఉండాలని పోరాడిన వ్యక్తి అంశాల స్వామి అని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఎమ్మెల్యేల సంతాపం

మునుగోడు నియోజకవర్గంలోని శివన్నగూడెం గ్రామానికి చెందిన ఫ్లోరోసిస్ బాధితుడు అంశాల స్వామి మృతికి నల్లగొండ, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. స్వామి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

బీఆర్ఎస్‌ను ప్రజలే బొంద పెడతారు

డిండి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు బొందపెట్టి బీజేపీని అధికారంలోకి తీసుకురావడం ఖాయమని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయని సీఎం కేసీఆర్.. బీఆర్ఎస్ పేరుతో దేశమంతా తెలంగాణ రాష్ట్రం మాదిరిగా అభివృద్ధి చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. శనివారం నల్లగొండ జిల్లా డిండి మండలం చెర్కుపల్లిలో జరిగిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఈటల రాజేందర్ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గడిచిన ఎనిమిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రారంభించిన ఒక్క ప్రాజెక్టు నుంచి కూడా ఒక ఎకరం వ్యవసాయ భూమికి నీరందలేదని, వరుణ దేవుడు కరుణతో కురుస్తున్న వర్షాలకు మాత్రమే చెరువులు, కుంటలు నిండాయన్నారు. దేవరకొండ నియోజకవర్గంలోని ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల పథకం పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయని విమర్శించారు. మునుగోడు ఉప ఎన్నికల్లో మంత్రులు, ఎమ్మెల్యేలంతా అక్కడే మకాం వేసి డబ్బు, మద్యం పంపిణీ చేసినా అత్తెసరు ఓట్లతో టీఆర్ఎస్ గెలిచిందని, నైతికంగా బీజేపీనే గెలిచిందన్న సంగతి ప్రజలందరికీ తెలుసన్నారు. సమావేశంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడులో బీజేపీదే నైతిక విజయం

ఆత్మకూరు(ఎం) : మునుగోడు ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌ది గెలుపే కాదని, నైతిక విజయం బీజేపీదేనని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతుందని, సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడుదామన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి హోదాలో ఉండికూడా రాష్ట్ర గవర్నర్‌ను మహిళ అని చూడకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల విశ్వాసం కోల్పోయారని, ఆ పార్టీలోని కొందరు నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కేసీఆర్‌కు కొమ్ముకాస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రధాని మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో బునాదిగాని కాల్వ, రాయిగిరి– మోత్కూరు రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయినట్లు తెలిపారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు తడిసిన మల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు తుమ్మల మురళీధర్‌రెడ్డి, బొట్టు అబ్బయ్య, బొట్టు కృష్ణయ్య, బొబ్బల ఇంద్రారెడ్డి, దయ్యాల కుమారస్వామి తదితరులు ఉన్నారు.

అణగారిన వర్గాల పాలన రావాలి

సూర్యాపేట రూరల్ : తెలంగాణలో దొరల ఆధిపత్య పాలన పోయి అణగారిన వర్గాల పాలన రావాలని డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ఆకాంక్షించారు. శనివారం సూర్యాపేట మండల కేంద్రం నుంచి దురాజ్‌పల్లి మీదుగా ఇమాంపేట గ్రామానికి స్వరాజ్య 10వేల కిలోమీటర్ల పాదయాత్ర చేరుకున్న సందర్భంగా డీఎస్పీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. తరతరాలుగా రాజకీయ బానిసలుగా బతుకుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీల పాలన అత్యవసరంగా రావాలని, అందు కోసమే పాదయాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. మన రాజ్యమొస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రలందరికీ ఉచిత విద్యా, వైద్యం ఉపాధితో పాటు భూమి ఇల్లు సాధించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేహెమాన్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా కన్వీనర్ కిరణ్‌కుమార్, రమేష్, సైదులు, శ్రీనివాస్, బాలు, అంబేద్కర్, రాము, నరేష్ పాల్గొన్నారు.

వీఎం హోం విద్యార్థి ఆత్మహత్య

- మిత్రుల గొడవతో మనస్తాపం
- చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణం



హరినాయక్ (ఫైల్)

చైతన్యపురి: సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సహచర విద్యార్థులతో జరిగిన గొడవతో మనస్తాపానికి గురైన అతడు బయటకు వెళ్లి కర్మన్‌ఘాట్ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ సీతారాం, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం ముదిగొండ గ్రామం మటికతండాకు చెందిన రత్లావత్ హరినాయక్ (16) సరూర్‌నగర్ వీఎం హోంలో పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి గోప్యా, తల్లి శాంతి పదేళ్ల క్రితం చనిపోగా బంధువులు అతడిని వీఎం హోంలో చేర్పించారు. శుక్రవారం సాయంత్రం వసతి గృహంలోని కొందరు విద్యార్థులకు, హరి నాయక్‌కు మధ్య దుస్తులు ఉతికే సమయంలో స్వల్పంగా గొడవ జరిగింది. దీంతో అతడు రాత్రి సమయంలో వీఎం హోం వెనక గోడ దూకి బయటకు వెళ్లిపోయినట్లు తోటి విద్యార్థులు చెబుతున్నారు. ఈ విషయాన్ని వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్‌కు చెప్పగా హరి సోదరుడు ఉప్పల్‌లో ఉండే భాస్కర్ (ఇదే హోం పూర్వ విద్యార్థి)కి సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు అంతటా వెతికినా హరి జాడ దొరకలేదు.

కర్మన్‌ఘాట్ సమీపంలో..

వసతిగృహం నుంచి బయటకు వెళ్లిన హరినాయక్ శనివారం మధ్యాహ్నం కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయినట్లు సరూర్‌నగర్ పోలీసులకు సమాచారం అందింది. హరినాయక్ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

వీఎం హోం ఎదుట ఆందోళన..

హోం నిర్వాహకులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే హరినాయక్ మృతిచెందాడని కుటుంబ సభ్యులు, కుల సంఘాల నాయకులు, వీఎం హోం మాజీ విద్యార్థుల సంఘం నాయకులు ఆందోళనకు దిగారు. హోంలో 660 మంది విద్యార్థులు ఉన్నా సరైన భద్రత ప్రమాణాలు పాటించడంలేదని, సెక్యూరిటీ సిబ్బంది లేరని ఆరోపించారు. హరి మృతికి కారణమైన తోటి విద్యార్థులు, హోం నిర్వాహకులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుడి సోదరుడు భాస్కర్‌కు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు.

కాపురానికి రావడం లేదని..

- పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

రామగిరి(నల్లగొండ) : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. తిప్పర్తి మండల పరిధిలో వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సైదబావిగూడేనికి చెందిన ఏశబోయిన అంజి(36) వ్యసాయం చేస్తున్నాడు. కొంత కాలంగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇటీవల భార్య పార్వతమ్మ పుట్టింటికి వెళ్లి తిరిగి రావడం లేదు. దీంతో మనస్తాపం చెందిన అంజి శుక్రవారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి అన్న ఏశబోయిన శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ మట్టయ్య తెలిపారు.

తొలి దశ ఉద్యమంలో నర్సింహారెడ్డి పాత్ర కీలకం



నేలమర్రిలో నర్సింహారెడ్డి విగ్రహావిష్కరణ చేస్తున్న లక్ష్మీనారాయణ

మునగాల(కోదాడ): తొలి దశ ఉద్యమంలో కన్మతరెడ్డి నరసింహారెడ్డి కీలకపాత్ర పోషించారని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శనివారం మునగాల మండలంలోని నేలమర్రి గ్రామంలో నర్సింహారెడ్డి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నాడు తెలంగాణ రాష్ట్రం కోసం సాగిన ఉద్యమంలో సూర్యాపేట జిల్లాకు చెందిన ఉద్యమకారులు ముందుండి పోరాడారని గుర్తు చేశారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్ బచ్చలకూరి జార్జి, కో కన్వీనర్ మారేపల్లి పాపిరెడ్డి, నరసింహారెడ్డి కుమార్తె అపర్ణ, సోదరులు కన్మతరెడ్డి వెంకట్రాంరెడ్డి, సంఘం సహాయ కార్యదర్శి సీతారామిరెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు నీలకంఠం చలమంద, ప్రధాన కార్యదర్శి సీహెచ్ విగ్నేశ్వరరావు, కోశాధికారి నరేంద్ర విద్యాసాగర్‌రావు, ఉపాధ్యక్షుడు ఉన్నం సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

సైదన్నా.. మళ్లొస్తాం

- చివరి రోజు దీపారాధనతో ముగిసిన జాన్‌పహాడ్ దర్గా ఉర్సు
- మూడు రోజుల పాటు సాగిన ఉత్సవాలు
- తిరుగు ప్రయాణమైన భక్తజనం



దర్గాలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



జాన్‌పహాడ్‌దర్గా నుంచి తిరుగు ప్రయాణమైన భక్తులు

పాలకవీడు: జాన్‌పహాడ్ దర్గా ఉర్సు శనివారం దీపారాధనతో ముగిసింది. చివరి రోజు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జాతర సంబురాల్లో భక్తులు సైదన్నను దర్శించుకున్నారు. సైదన్నా.. మళ్లొస్తాం భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. చివరి రోజుకూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాబాను దర్శించుకున్నారు. నాగేంద్రుడి పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంచాయతీరాజ్, పోలీస్, రెవెన్యూ, ఆరోగ్యశాఖల అధికారులు విధులు నిర్వహించారు. అయితే, వక్ఫ్‌బోర్డు అధికారులు భక్తులకు కనీసం స్నానాల గదులు, నీటి సౌకర్యాలు కల్పించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది స్వచ్ఛంద సంస్థలు ముందుకు రాకపోవడంతో డెక్కన్ సిమెంట్స్ కర్మాగారం వారు తాగు నీటికి ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్ రెడ్డి, హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు జరగకుండా పర్యవేక్షించారు. ఎట్టకేలకు ఉర్సు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆర్టీసీకి స్వల్ప ఆదాయం

మూడు రోజులు వైభవంగా కొనసాగిన జాన్‌పహాడ్ దర్గా ఉర్సుకు భక్త జనం ప్రైవేటు వాహనాల్లోనే అధికంగా తరలి వచ్చారు. దీంతో ఆర్టీసీకి స్వల్ప ఆదాయం వచ్చినట్లు మిర్యాలగూడ, కోదాడ డిపో మేనేజర్లు తెలిపారు. మిర్యాలగూడ నుంచి 15 బస్సులు నిరంతరాయంగా 75 ట్రిప్పుల్లో భక్తులను తరలించినట్లు తెలిపారు. దీని ద్వారా రూ. 3.50 లక్షలు, కోదాడ డిపో నుంచి 7 బస్సుల ద్వారా రూ.1.24 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.